లంక జయకేతనం

2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ • 15 ఏండ్ల తర్వాత కివీస్‌పై చరిత్రాత్మక విజయం

గాలె: స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన రెండు టెస్టు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను శ్రీలంక 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. గాలె వేదికగా జరిగిన రెండో టెస్టులో లంకేయులు కివీస్‌పై ఇన్నింగ్స్ 154 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి 15 ఏండ్ల తర్వాత న్యూజిలాండ్‌పై టెస్టు సిరీస్‌ను గెలుచుకోవడం విశేషం. ఆట నాలుగో రోజు ఓవర్ నైట్ స్కోరు 199/5వ వద్ద ఇన్నింగ్స్ ఆరంభించిన టిమ్ సౌథీ సేన.. 81.4 ఓవర్లలో 360 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్ (88 ఆలౌట్)తో పోలిస్తే కాస్త మెరుగ్గానే ఆడినా పర్యాటక జట్టుకు పరాభవం తప్పలేదు. లంక ఫీల్డర్లు పలు క్యాచ్‌లు జారవిడిచినా, స్టంప్ అవుట్స్ నుంచి తప్పించుకున్నా న్యూజిలాండ్ బ్యాటర్లు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. గ్లెన్ ఫిలిప్స్ (78), మిచెల్ సాంట్నర్ (67), టామ్ బ్లండెల్ (60) ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించడానికి పోరాడారు. లంక బౌలర్లలో తొలి టెస్టు ఆడిన నిషాన్ పీరిస్ (6/170) రాణించగా లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (3/139) లోయరార్డర్ పనిపట్టాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 182 పరుగులు చేసిన కమిందు మెండిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు రాగా సిరీస్‌లో 18 వికెట్లు పడగొట్టిన జయసూర్యకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' దక్కింది. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో లంక మూడో స్థానం (55.56 శాతం) లోకి దూసుకొచ్చింది. ఈ జాబితాలో భారత్ (71.67), ఆస్ట్రేలియా (62.5) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

వర్షం లేకున్నా ఆట సాగలె..

మూడో రోజూ అదే కథ • భారత్, బంగ్లాదేశ్ టెస్టు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట కూడా రద్దైంది. ఆదివారం వర్షం లేకపోయినా ఉదయం నుంచి ఎండ బాగానే కాసినా మైదానం చిత్తడిగా ఉండటంతో ఆట సాధ్యం కాలేదు. దీంతో వరుసగా రెండు రోజులూ ఒక్క బంతి కూడా పడకుండానే ఆట రద్దవడం గమనార్హం. తొలి రోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమవగా రెండు రోజుల పాటు మ్యాచ్‌కు అంతరాయం కలిగించిన వరుణుడు మూడో రోజు కాస్త తెరిపినిచ్చినా ఔట్ ఫీల్డ్ అనువుగా లేకపోవడంతో మ్యాచ్ సాగలేదు. వర్షం లేకపోవడంతో మ్యాచ్‌ను ఆస్వాదిద్దామని భావించి స్టేడియానికి పోటెత్తిన కాన్పూర్ వాసులకు నిరాశ తప్పలేదు. ఉదయం 9 గంటలకు ఒకసారి 10 గంటలకు మరోసారి మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు ఔట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండటంతో మ్యాచ్‌ను నిర్వహించడం కష్టమని ప్రకటించారు. గ్రౌండ్ సిబ్బంది మైదానాన్ని ఆరబెట్టేందుకు కృషి చేసినా ఫలితం లేకుండా పోయింది. మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ పరిశీలనకు వచ్చిన మ్యాచ్ నిర్వాహకులు మైదానం అలాగే ఉండటంతో మూడో రోజు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఈ మ్యాచ్ డ్రాగా ముగియడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే భారత్ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల మీద ప్రభావం పడే అవకాశముంది.

డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే..!

కాన్పూర్: వరుణుడు తెరిపినిచ్చాడు.. రోజంతా ఎండ కాచింది.. స్టేడియాన్ని కప్పి ఉంచే కవర్లూ కనిపించలేదు.. అయినా కాన్పూర్ టెస్టులో మూడోరోజు మాత్రం ఒక్క బంతీ పడలేదు. ఆట ఎప్పుడు మొదలవుతుందా? తమ అభిమాన క్రికెటర్లను ఎప్పుడెప్పుడు చూస్తామా? అని వందలాది కిలోమీటర్లు ప్రయాణించి కాన్పూర్‌కు చేరిన ఫ్యాన్స్‌కు నిరాశ తప్పలేదు. దీనికి ప్రధాన కారణం 'గ్రీన్‌పార్క్'లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండో టెస్టు రెండో రోజు వర్షం కురిసినా ఆదివారం రాత్రి నుంచి అక్కడ వరుణుడు శాంతించి రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. కానీ మూడుసార్లు మైదానాన్ని పరిశీలించిన మ్యాచ్ నిర్వాహకులు ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో ఆట సాగదని తేల్చేశారు. మైదానంలోని థర్టీ యార్డ్ సర్కిల్‌తో పాటు డీప్ మిడ్‌వికెట్ వద్ద లోపలి భాగం తడిగా ఉన్నట్టు మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో అభిప్రాయపడ్డారు. అయితే దీనిపై పిచ్ క్యూరేటర్ శివ్ కుమార్ మాత్రం మరో విధంగా స్పందించాడు. 'వాళ్లు (పరిశీలనకు వచ్చిన వారు) మూడుసార్లు మైదానాన్ని పరిశీలించారు కానీ అసలు సమస్య ఏంటో మాకు చెప్పలేదు. ఒకవేళ అలా చెప్పుంటే మేం అందుకు తగ్గ చర్యలు తీసుకునేవాళ్లం. మీకు ఏదైనా సమస్య ఉంటే మాకు చెప్పండి అని కూడా చెప్పాను' అని తెలిపాడు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కాన్పూర్ ఇక టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదంలో పడింది. యూపీ రాజధాని లక్నోలోని ఏకనా స్టేడియంలో అధునాతన వసతులు కలిగి ఉండటంతో ఇకనుంచి గ్రీన్ పార్క్‌కు ఆతిథ్య హక్కులు దక్కడం కష్టమేనని తెలుస్తోంది.

క్వార్టర్స్‌కు అల్కారజ్

• చైనా ఓపెన్

బీజింగ్: టాప్ సీడ్ కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్) చైనా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. బీజింగ్‌లో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్‌గా బరిలోకి దిగిన అల్కారజ్.. 6-1, 6-2తో టాలన్ గ్రీక్స్పూర్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు. ప్రత్యర్థి నుంచి కనీస ప్రతిఘటన కూడా లేకుండానే ఈ స్పెయిన్ కుర్రాడు మ్యాచ్‌ను ముగించాడు. క్వార్టర్స్‌లో అతడు కరెన్ కచనోవ్ (రష్యా)తో తలపడాల్సి ఉంది. మహిళల డబుల్స్‌లో అమెరికా టెన్నిస్ క్రీడాకారాణి కోకో గాఫ్ 7-5, 6-2తో కేటీ బౌల్టర్ (బ్రిటన్)ను చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. రౌండ్-32లో మరో టాప్ సీడ్ జెస్సికా పెగుల 6-7 (9/11), 6-1, 6-2తో వెరొనిక (రష్యా)ను ఓడించింది.

భారత షూటర్లకు స్వర్ణాలు

లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు అదరగొట్టారు. పురుషులు, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్స్‌లో స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. పురుషుల విభాగంలో ఉమేశ్, ప్రద్యుమ్న్ సింగ్, ముకేశ్‌తో కూడిన భారత త్రయం.. 1,726 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని ముద్దాడింది. ఇటలీకి రజతం దక్కగా రొమానియా కాంస్యం సాధించింది. మహిళల కేటగిరీలో కనిష్క, లక్షిత, అంజలి.. 1,708 పాయింట్లతో బంగారు పతకాన్ని నెగ్గారు. అజర్‌బైజాన్, ఉక్రెయిన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల వ్యక్తిగత ఈవెంట్‌లో కనిష్క కాంస్యం సాధించింది. ఇక పురుషుల వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్ చేరిన ఉమేశ్, ప్రద్యుమ్న్.. 6, 8 స్థానాల్లో నిలిచారు.

సిరీస్ ఆసీస్‌దే..

లండన్: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆసీస్ 3-2తో కైవసం చేసుకుంది. ఆదివారం బ్రిస్టోల్‌లోని కౌంటీ గ్రౌండ్ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో ఆస్ట్రేలియా.. 49 పరుగుల తేడా (డక్‌వర్త్‌లూయిస్ పద్ధతిలో)తో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. 49.2 ఓవర్లలో 309 పరుగులు చేసింది. అనంతరం వర్షం కురిసే సమయానికి కంగారూలు.. 20.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేశారు. ట్రావిస్ హెడ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులు లభించాయి.

హైదరాబాద్‌లో పికిల్‌బాల్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వచ్చే ఏడాది జనవరిలో హైదరాబాద్ వేదికగా ఆసియన్ ఓపెన్ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించనున్నట్టు అమెచ్యూర్ తెలంగాణ పికిల్‌బాల్ అసోసియేషన్ (ఏటీపీఏ) అధ్యక్షుడు రావుల శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసియా వ్యాప్తంగా అండర్-12, 14, 16, 19+, 35+, 60+ కేటగిరీలలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నట్టు ఏటీపీఏ తెలిపింది.

బోర్డు సంపన్నం.. వసతులు అధ్వానం..

ముంబై: ప్రపంచ క్రికెట్‌ను కనుసైగతో శాసించగల బీసీసీఐ అత్యంత సంపన్న బోర్డులలో ఒకటి. ఐపీఎల్ పుణ్యమా అని వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న బీసీసీఐ.. మైదానాల్లో కనీస వసతులు కల్పించడంలో దారుణంగా విఫలమవుతోంది. 2023 ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా ప్రపంచంలోనే అత్యధిక సీటింగ్ సామర్థ్యం కలిగిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో మైదానాన్ని డస్టర్లు, ఫ్యాన్లతో ఆరబెట్టడం విమర్శలకు తావిచ్చింది. ఇటీవలే అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్ మధ్య నోయిడా వేదికగా అర్ధాంతరంగా ముగిసిన ఏకైక టెస్టులోనూ ఇదే కథ. అఫ్గాన్ క్రికెట్ బోర్డు కోరడంతో నోయిడాలో మ్యాచ్ నిర్వహణకు బీసీసీఐ అంగీకారం తెలిపింది. అక్కడా వర్షం లేకున్నా ఔట్ ఫీల్డ్ తడిగా ఉండటంతో ఐదు రోజుల్లో కనీసం టాస్ కూడా పడకుండానే మ్యాచ్ రద్దవడంతో సోషల్ మీడియాలో బీసీసీఐపై ట్రోలింగ్ వెల్లువెత్తింది. తాజాగా కాన్పూర్‌లోనూ ఇదే పునరావృతమవుతుండటంతో బీసీసీఐ క్రికెట్ అభిమానుల ఆగ్రహానికి గురవుతోంది. కోటానుకోట్ల రూపాయలు ఆర్జిస్తున్న బోర్డు.. స్టేడియాలలో కనీసం మ్యాచ్ నిర్వహణకు అవసరమయ్యే వసతులనూ సమకూర్చడం లేదని అభిమానులు వాపోతున్నారు.

కొత్త ఎన్‌సీఏ ప్రారంభం

బెంగళూరు విమానాశ్రయానికి చేరువలో సీవోఈ.. క్రికెటర్లకు వరం: వీవీఎస్ లక్ష్మణ్

బెంగళూరు: ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు అయిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బెంగళూరులోని తమ కొత్త నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించింది. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా దీనిని అధికారంగా ప్రారంభించారు. కొత్త ఎన్‌సీఏకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)గా పేరుపెట్టింది. ప్రపంచ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక సౌకర్యాలతో సీవోఈను ఏర్పాటు చేసినట్టు బీసీసీఐ తెలిపింది. ప్రస్తుతమున్న ఎన్‌సీఏను బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి సమీపాన ఉన్న ప్రదేశంలో నిర్వహిస్తుండగా.. తాజాగా ప్రారంభించిన సీవోఈను కెంపెగౌడ విమానాశ్రయం సమీపంలో సుమారు 40 ఎకరాల విశాల ప్రాంగణంలో నిర్మించారు.కొత్తగా ప్రారంభించిన సీవోఈకి హెడ్‌గా వ్యవహరిస్తున్న హైదరాబాదీ వీవీఎస్ లక్ష్మణ్ ఇక్కడి వసతులు భారత ఔత్సాహిక క్రికెటర్లకు ఓ వరమని అభివర్ణించాడు.

వసతులెన్నో..

సీవోఈలో మూడు ప్రపంచ స్థాయి గ్రౌండ్‌లు, 86 ప్రాక్టీస్ పిచ్‌లు (ఇండోర్ 41, ఔట్‌డోర్ 45), అత్యాధునిక సౌకర్యాలతో కూడిన రిహాబిటేషన్ సెంటర్, అండర్‌వాటర్ పూల్ స్పా, సకల సౌకర్యాలు కలిగిన జిమ్, ఒలింపిక్ ప్రమాణాలతో కూడిన స్విమ్మింగ్ పూల్, ఆరు ఔట్‌డోర్ రన్నింగ్ ట్రాక్‌లు వంటి ఎన్నో వసతులున్నాయి. మూడు ప్రధాన గ్రౌండ్లలో ఒకదానిని ముంబైలోని ఎర్రమట్టితో నిర్మించగా మిగతా వాటిని మాండ్య (కర్నాటక), కలహండి (ఒడిషా)లోని నల్లమట్టితో తయారుచేశారు. మెయిన్ గ్రౌండ్‌ను ఇంగ్లీష్ కౌంటీ గ్రౌండ్స్ తరహాలో రూపొందించారు. ఇక్కడ మ్యాచ్‌లను ఆడించేందుకు వీలుగా ఫ్లడ్‌లైట్లు, ఇతర వసతులూ కల్పించారు. యూకే, ఆస్ట్రేలియా నుంచి ప్రీమియం టర్ఫ్‌లతో 8 పిచ్‌లను తయారుచేశారు. సీవోఈని కేవలం క్రికెటర్లకే కాకుండా అథ్లెటిక్స్, ఇతర క్రీడల క్రీడాకారులూ ఉపయోగించుకునేలా తీర్చిదిద్దారు.

వారసుడిని త్వరగా గుర్తించండి!

బీసీసీఐ కార్యదర్శిగా త్వరలో ఆ పదవి నుంచి తప్పుకోనున్న జై షా వారసుడిని వీలైనంత త్వరగా గుర్తించాలని బోర్డు సభ్యులు అతడిని కోరినట్టు సమాచారం. బీసీసీఐ 93వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) సందర్భంగా ఈ అంశం చర్చలోకి వచ్చింది. జై షా ఐసీసీ చైర్మన్ పదవి చేపట్టనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సభ్యులు అభ్యర్థించినట్టు తెలుస్తోంది. ఈ పదవి రేసులో రోహన్ జైట్లీ (ఢిల్లీ), అషిష్ షెలార్ (ముంబై), దేవ్‌జిత్ సైకియా (గుజరాత్) రేసులో ఉన్నట్టు సమాచారం. ఇక ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో జనరల్ బాడీ రిప్రజెంటేటివ్స్‌గా అర్జున్ సింగ్ ధుమాల్, అవిశేక్ దాల్మియా ఎంపికయ్యారు. ఆంధ్రా మాజీ క్రికెటర్ వి. చాముండేశ్వరినాథ్ ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) ప్లేయర్ రిప్రజెంటేటివ్‌గా నామినేట్ అయ్యారు.

చిత్రం

700 మంది డ్యాన్సర్లతో పాట

దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది కన్నడ సోయగం రష్మిక మందన్న. 'పుష్ప' 'యానిమల్' చిత్రాలతో ఆమె హిందీ బెల్ట్‌లో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం రష్మిక మందన్న చారిత్రక చిత్రం 'ఛావా'లో నటిస్తున్నది. విక్కీ కౌశల్ కథానాయకుడు. ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ జీవిత కథ ఆధారంగా, ఆయన మొఘల్స్‌పై చేసిన అసామాన పోరాటం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భారీ వ్యయంతో రూపొందిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలోని ఓ పాటను 700 మంది డ్యాన్సర్లతో తెరకెక్కించబోతున్నారని తెలిసింది. శంభాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడయ్యే సందర్భంలో వచ్చే ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. 16వ శతాబ్దం నాటి సంగీత వాయిద్యాలతో మరాఠీ జానపద శైలిలో ఏ.ఆర్.రెహమాన్ ట్యూన్ సిద్ధం చేశారని తెలిసింది. మహారాష్ట్రలోని రాయ్‌ఘడ్ కోటలో ఈ పాటను చిత్రీకరించబోతున్నారు. 700 మంది డ్యాన్సర్లు, 1000 మందికిపైగా జూనియర్ ఆర్టిస్టులతో ఈ పాటను కన్నులపండువగా తీర్చిదిద్దబోతున్నామని దర్శకుడు లక్ష్మణ్ ఊటేకర్ చెప్పారు. ఇందులో కథానాయిక రష్మిక మందన్న నృత్యాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని అన్నారు. శివాజీ సావంత్ రాసిన 'ఛావా' నవల ఆధారంగా అదే పేరుతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది.

రొమాంటిక్ హీరోగా..?

బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తెరంగేట్రానికి రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ తొలి చిత్రం తెరకెక్కనుంది. అయితే.. ఇది ఏ తరహా సినిమా అనేది అభిమానుల్లో నెలకొని ఉన్న ప్రశ్న. సాధారణంగా నందమూరి అభిమానులు మాస్ సినిమాలనే ఎక్కువగా ఇష్టపడతారు. మరి మోక్షజ్ఞని ప్రశాంత్‌వర్మ మాస్ అవతార్‌లోనే ప్రజెంట్ చేస్తున్నాడా ?.. అంటే.. ఫిల్మ్ వర్గాలు కాదనే చెబుతున్నాయి. ఈ సినిమాలో మోస్ట్ రొమాంటిక్‌గా మోక్షజ్ఞని చూపించబోతున్నారట ప్రశాంత్‌వర్మ. అందుకు తగ్గట్టుగా రొమాంటిక్ లవ్‌స్టోరీనే ఆయన ఎంచుకున్నారట. ఈ సినిమాలోని ఓ ప్రత్యేక పాత్రలో బాలకృష్ణగానీ, కల్యాణ్‌రామ్‌గానీ నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందులో హీరోయిన్‌గా ముందు శ్రీలీల పేరు వినిపించింది. కానీ.. దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఆలోచన మాత్రం వేరేలా ఉందట. కచ్చితంగా హిట్ కొట్టాలనే తలంపుతో.. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌కి ఎక్కువ సమయం తీసుకుంటున్నారు ప్రశాంత్‌వర్మ. దసరా రోజున ఈ సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ షూటింగ్‌కి మాత్రం టైమ్ పట్టేలా ఉందని సమాచారం.



అరుదైన గౌరవం

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు హీరో రామ్‌చరణ్. త్వరలో ఆయనకు మరో గొప్ప గౌరవం కూడా దక్కబోతున్నది. సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం వారు రామ్‌చరణ్ మైనపు బొమ్మను ఏర్పాటు చేయబోతున్నారు. చరణ్‌తోపాటు ఆయన పెంపుడు శునకం రైమీ కూడా ఈ విగ్రహంలో భాగం కావటం విశేషం. దీనికి సంబంధించిన ఫొటోషూట్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే ఈ విగ్రహాన్ని రూపొందించి, ఆవిష్కరిస్తామని ఐఫా వేదికగా టూస్సాడ్స్ టీమ్ ప్రకటించింది. టూస్సాడ్స్ కుటుంబంలో తానూ భాగం కావడం గౌరవంగా భావిస్తున్నానని రామ్‌చరణ్ అన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. స్టార్ హీరోల మైనపు బొమ్మలను ఇతర దేశాల మ్యూజియమ్స్‌లో ఏర్పాటు చేయడం తరచుగా జరుగుతున్న విషయమే. బాలీవుడ్‌లో అమితాబ్ దగ్గర్నుంచి ఖాన్స్ త్రయం, హృతిక్ రోషన్.. ఇలా చాలామంది మైనపు బొమ్మలను ఇతర దేశాల మ్యూజియమ్స్‌లో ఏర్పాటు చేశారు. తెలుగు హీరోల్లో ఆ గౌరవాన్ని దక్కించుకున్న హీరోల్లో మహేశ్‌బాబు, ప్రభాస్, అల్లు అర్జున్ ఉన్నారు. ఇప్పుడు వారి సరసన రామ్‌చరణ్ కూడా చేరబోతున్నారు.

'మా' సభ్యులకు ఫ్రీ హెల్త్ చెకప్

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులందరికీ ఫ్రీ మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. 'మా' ఆధ్వర్యంలో జీవీకే హెల్త్ హబ్ ద్వారా ఈ హెల్త్ క్యాంప్ జరిగింది. ఈ క్యాంప్‌లో 'మా' సభ్యులంతా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు మాట్లాడుతూ 'డా.శాస్త్రిగారికి, జీవీకే హెల్త్ హబ్‌కు 'మా' తరపున కృతజ్ఞతలు. వేల ఖర్చుతో కూడుకున్న హెల్త్ చెకప్‌ను ఉచితంగా అందించడం సామాన్యమైన విషయం కాదు. ఉదయం 7గంటల నుంచి ఎంతో ఓర్పుతో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వీరి సేవాకార్యక్రమాలు ఇకపై కూడా ఇలాగే సాగాలని ఆశిస్తున్నా' అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాదల రవి, శివబాలాజీ, డా.శాస్త్రి కూడా మాట్లాడారు.

తెలుగులో అలియా 'జిగ్రా'

యాక్షన్ ప్యాక్ట్ రోల్‌లో అలియాభట్ నటించిన బాలీవుడ్ చిత్రం 'జిగ్రా'. ఆపదలో ఉన్న తమ్ముడి కోసం అక్క చేసే పోరాటమే ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకుడు. కరణ్ జోహార్, అపూర్వ మెహతా, షాహిన్ భట్, సోమెన్ మిశ్రాలతో కలిసి అలియాభట్ నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం అక్టోబర్ 11న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్మెంట్స్ ద్వారా రానా దగ్గుబాటి ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ని అగ్రహీరో రామ్‌చరణ్ విడుదల చేశారు. 'జిగ్రా' తెలుగు ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనున్నదని, అన్ని భాషల్లో సినిమాను విడుదల చేస్తామని, ఏషియన్ సురేశ్ సంస్థ ద్వారా రానా దగ్గుబాటి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడం ఆనందంగా ఉందని నిర్మాతల్లో ఒకరైన అపూర్వ మెహతా అన్నారు. రానా మాట్లాడుతూ 'జిగ్రా' కథలోని సోల్‌కి ఏ భాష వారైనా కనెక్ట్ అవుతారు. ఇది కేవలం యాక్షన్ సినిమానే కాదు. కుటుంబంలోని అనుబంధాలను తెలిపే సినిమా. అక్కా, తమ్ముళ్లుగా అలియా, వేదాంగ్ రైనా అద్భుతంగా నటించారు.' అని రానా చెప్పారు.

చిన్న పాత్రల నుంచి స్టార్ హీరోయిన్ రేంజ్‌కి

స్టార్ స్టేటస్ సాధించిన అతికొద్ది మంది తెలుగు హీరోయిన్లలో రీతూవర్మ ఒకరు. ఎంతో శ్రమిస్తేగానీ ఆమె ఈ స్థాయికి రాలేదు. హీరోయిన్ ఫ్రెండ్స్‌లో ఒకరిగా ఆమె కనిపించిన సినిమాలు చాలా ఉన్నాయి. 'పెళ్లి చూపులు'తో హీరోయిన్ స్థాయికి చేరుకున్న రీతూ.. కనులు కనులను దోచాయంటే, వరుడు కావలెను, టక్ జగదీష్ చిత్రాలతో స్టార్ హీరోయిన్ రేంజ్‌కి ఎదిగింది. తెలుగు హీరోయిన్లలో ప్రామిసింగ్ యాక్టెస్‌గా పేరు సంపాదించుకుంది. తమిళంలోనూ క్రేజీ ప్రాజెక్టులు చేస్తున్నది. ఇవే కాక హాట్‌స్టార్ కోసం ఓ వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నది. ఇది తను చేస్తున్న తొలి సిరీస్. ఇదిలావుంటే.. 'స్వాగ్' సినిమాతో త్వరలో ఆమె ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఇందులో వింధ్యామర వంశ మహారాణి రుక్మిణీదేవి పాత్రలో మెరవనున్నది రీతూ. ఈ సినిమాలో ఆమె పాత్ర హైలైట్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.

యువతరం మెచ్చే మిస్టర్ ఇడియట్

అగ్ర హీరో రవితేజ తమ్ముడి కుమారుడైన మాధవ్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్‌శర్మ కథానాయిక. గౌరి రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ర చిత్రాన్ని నిర్మించారు. త్వరలో సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. అతిథులుగా వచ్చిన డైరెక్టర్ ప్రశాంత్‌వర్మ, బెక్కెం వేణుగోపాల్ యూనిట్‌కి శుభాకాంక్షలందించారు. యూత్ మెచ్చేలా సినిమా తీశామని, అనూప్ రూబెన్స్ మ్యూజిక్ సినిమాకు హైలైట్ అని డైరెక్టర్ గౌరి తెలిపారు. నవంబర్‌లో సినిమాని రిలీజ్ చేస్తామని నిర్మాత చెప్పారు. ఇంకా హీరోహీరోయిన్లు మాట్లాడారు.

బహిర్భూమికి ఓ చరిత్ర ఉంది

నోయల్, రిషిత నెల్లూరు జంటగా నటిస్తున్న చిత్రం 'బహిర్భూమి'. రాంప్రసాద్ కొండూరు దర్శకుడు. మచ్చ వేణుగోపాల్ నిర్మాత. అక్టోబర్ 4న సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మంచి టీమ్‌తో అందరికీ నచ్చేలా తీసిన సినిమా ఇదని హీరో నోయల్ చెప్పారు. ' 'బహిర్భూమి' పేరుకు ఓ చరిత్ర ఉంది. అప్పట్లో బహిర్భూమి కోసం రెండు ఊళ్ల మధ్య గొడవలు జరిగేవి. ఈ పేరెందుకు పెట్టామో మూవీ చూస్తే తెలుస్తుంది.' అని దర్శకుడు అన్నారు. ఈ సినిమా నిర్మించినందుకు గర్వంగా ఉందని, అక్టోబర్ 4న సినిమాను విడుదల చేస్తున్నామని, త్వరలో ఇతర భాషల్లో కూడా విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు.

అందరూ చూడాల్సిన సినిమా

తెలంగాణ నేపథ్య కుటుంబకథాచిత్రం 'లగ్గం'. సాయి రోనక్, ప్రగ్యా నగ్రా, రాజేంద్రప్రసాద్, రోహిణి ప్రధాన ప